తపాలా.. సేవలు భళా

ప్రియమైన శ్రీవారు.. ఇట్లు.. మీ శ్రేయోభిలాషి.. అనే చేతి రాతలకు చిరునామాగా ఆ నాటి ఉత్తరం నిలిచింది. ఉత్తరం ఓ అద్భుత అనుభూతి.. ఓ ఆనందం.. ఓ అనుబంధం.. ఓ క్షేమం.. ఓ అభినందన.. ఓ ప్రేమలేఖ.. ఓ ఉద్యోగ నియామక పత్రం.. ఓ మరణవార్త.. ఇలా ఎన్నెన్నో మంచి చెడుల అనుభూతులను అందించే అద్భుత సాధనం ఉత్తరం. సోమవారం నుంచి 13వ తేదీ వరకు పోస్టల్ శాఖ వారోత్సవాలను నిర్వహించనున్నారు. వారం రోజుల పాటు రోజుకు ఒక్కొక్క సేవపై ప్రజలకు అవగాహన, సిబ్బందితో ర్యాలీలు, ప్రచారాలు నిర్వహిస్తారు.

- నేటికీ తగ్గని సేవలు
- సాంకేతిక పరిజ్ఞానంతో అడుగులు
- నేడు తపాలా దినోత్సవం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రస్తుతం తపాలా శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగుతోంది. ప్రజలకు సేవలందించడంలో తగ్గేదేలా అన్నట్టుగా తన పరిధిని విస్తరించుకుంటూ పోతోంది. పాతతరం పద్ధతులను పక్కనపెట్టిన నూతన ఒరవడితో ప్రత్యేకతను చాటుకుంటోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా వినియోగదారుల ఆలోచనలకు తగ్గట్టుగా సేవలందిస్తోంది. ఎన్నో రకాల కొరియర్ సర్వీసులు అందుబాటులోకి వస్తున్నప్పటికీ నేటికీ తపాలా శాఖ ద్వారానే ఉత్తరాలు, పార్సిల్‌లు ప్రజలకు అందుతున్నాయంటే అతిశయోక్తి కాదు. ఫిలాటెలీ, ఎలక్ట్రానిక్ ఈఎంఓ, ఎంఎంటీఎస్, టీటీడీ, సుకన్య సమృద్ధి యోజన, మన స్టాంపు, మన ఫొటో, స్పీడ్ పోస్టు, ఎలక్ట్రానిక్ మనియార్డర్, మనీ ట్రాన్స్‌ఫర్ సర్వీసు, మొబైల్ మనీ ట్రాన్స్‌ఫర్‌తో పాటు పోస్టల్ బ్యాంకు సేవలను అందిస్తోంది. ఆధార్ నుంచి పాస్‌పోర్టు వరకు ఎన్నో సేవలను అందిస్తూ వినియోగదారులకు మరింత చేరువవుతోంది.

వారోత్సవాలు

- 6న టెక్నాలజీ డే సందర్భంగా నూతన టెక్నాలజీపై ఉద్యోగులకు, కస్టమర్లకు అవగాహన
- 7న ఫైనాన్సియల్ డే నేపథ్యంలో పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐపై అవగాహన
- 8న ఫిలాటెలీ డే సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, ఫిలాటెలీపై గ్రూప్ డిస్కషన్
- 9న వరల్డ్ పోస్ట్ డే సందర్భంగా వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన
- 10న–కస్టమర్ డే నేపథ్యంలో వివిధ పథకాలపై డివిజన్ పరిధిలో చర్చలు, మీడియా సమావేశాలు నిర్వహించనున్నారు.

తపాలాశాఖ పరిధి

తపాలా శాఖను జిల్లాలో రెండు డివిజన్‌లుగా ఏర్పాటు చేశారు. కడప, ప్రొద్దుటూరు కేంద్రాలుగా సేవలు కొనసాగిస్తున్నారు. తపాలాశాఖలో రెండు డివిజన్లు నాటి నుంచి నేటి వరకు విశేష సేవలను అందిస్తున్నారు.

తపాలా చరిత్ర

మొఘలుల కాలంలో ఉత్తరాల బట్వాడాకు గుర్రాలు, ఒంటెలను వినియోగించేవారు. ఆధునిక కాలంలో పోస్టల్ వ్యవస్థ మధ్యయుగంలో వచ్చిందని చెప్పవచ్చు. కానీ మొదటి తపాలా కార్యాలయాన్ని ఈస్టిండియా కంపెనీ 1688లో స్థాపించింది. భారతదేశంలో 1764 రాబర్ట్ క్లైవ్ రెగ్యులర్ పోస్టల్ సిస్టమ్‌ను ఆరంభించారు. 1774లో కోల్‌కతాలో జనరల్ పోస్టాఫీసును ప్రారంభించారు. 1854లో అక్టోబర్ 1న మొదటి తపాలా బిల్లను ఇండియా పేరిట విడుదల చేశారు. 1872లో వాల్యూపేయబుల్ పార్శిల్‌ను 1879లో పోస్టుకార్డును, 1880లో మనియార్డర్‌ను, 1882లో సేవింగ్స్ ఖాతాలను, 1884లో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను ప్రవేశపెట్టారు. 1885లో ఇండియన్ పోస్టల్ ఆర్డర్‌ను, 1947 నవంబర్ 1న జాతీయ జెండా గుర్తుతో మొదటి తపాలా బిల్లను ముద్రించారు. 1972లో పోస్టల్ ఇండెక్స్ నంబర్ (పిన్‌కోడ్), 1994లో ఈఎంవోను 2004లో ఈ పోస్టు ప్రవేశ పెట్టారు.



పోస్టల్ ప్రధాన కార్యాలయం, కడప

సద్వినియోగం చేసుకోండి



తపాలా శాఖ నూతన పద్ధతులు తీసుకువచ్చింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నెట్‌వర్క్‌లను ప్రజలకు చేరువ చేసింది. గ్రామీణ ప్రాంతాలల్లోని ప్రజలు పోస్టల్ శాఖ అందిస్తున్న వివిధ పథకాలను వారి సంక్షేమం కోసం వినియోగించుకోవాలి. వినియోగదారులకు ఎటువంటి సేవలు కావాలో సమీప పోస్టాఫీసులో తెలుసుకోవచ్చు. తపాలాశాఖ అందిస్తున్న వివిధ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- రాజేష్, పోస్టల్ సూపరింటెండెంట్, కడప డివిజన్

అంధకారంలో కాలనీ



పటేల్‌రోడ్డులో వెలగని వీధిలైటు

కడప ఎడ్యుకేషన్: నగర కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంతో కాలనీ వాసులు అంధకారంలో మగ్గుతున్నారు. కడప ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పటేల్‌రోడ్డులోని ఎడమ వైపు వీధిలో కొద్ది రోజులగా వీధిలైటు వెలగడం లేదు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలతో పాటు చీకట్లో అవస్థలు పడుతున్నారు. అంధకారంలో ఉక్కపోత, దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల దృష్టికి సమస్య తీవ్రతను పలుమార్లు తీసుకొచ్చినప్పటికి ఫలితం కనిపించడం లేదని వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి వీధి లైట్లకు మరమ్మతులు చేయాలని పటేల్‌రోడ్డు వాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా వరల్డ్ బైబిల్ డే సెలబ్రేషన్స్



ప్రసంగిస్తున్న బిషప్ శామ్యూల్ బాబు

కడప రూరల్ : నగరంలోని మాసాపేటలోని ఎలీము ప్రార్థనా మందిరంలో ఆదివారం వరల్డ్ బైబిల్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బిషప్ డాక్టర్ కె. శామ్యూల్ బాబు మాట్లాడుతూ ఆనాడు బైబిల్‌ను చేతి రాతతో రాసి అమ్మే వారని ఆ ముద్రణలను ధనికులు ఎక్కువ రుసుం చెల్లించి తీసుకునే వారని చెప్పారు. అయితే బైబిల్‌ను పేదలకు అందించే ప్రక్రియలో అంతర్ యుద్ధం ఏర్పడుతుందని భావించిన జోహానస్ జాన్ గూటెన్ బర్గ్ బైబిల్ రూపకల్పనకు టైపు యంత్రాల ద్వారా అక్షరాలకు రూపకల్పన చేసి నేడు యేసు క్రీస్తును నమ్మిన ప్రతి ఒక్కరి చేతిలో బైబిల్ ఉండడానికి గూటెన్ బర్గ్ కారణమయ్యారని చెప్పారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా అన్ని భాషల్లో ముద్రించారని చెప్పారు. గూ టెన్ బర్గ్ జర్మనీ లోని మెయింజ్ పట్టణంలో 1400 సంవత్సరంలో జన్మించారని చెప్పారు. నేడు ఆయనను స్మరిస్తూ బైబిల్ ముద్రణ వేడుకలను ఘనంగా జరుపుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని శామ్యూల్ బాబు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ దాసరి సుధాకర్, పాస్టరమ్మ దాసరి సువర్ణమ్మ, రెవ డాక్టర్ మల్లెం విజయ భాస్కర్, వరప్రసాద్, సంఘ పెద్దలు, యువతీ యువకులు పాల్గొన్నారు

సద్వినియోగం చేసుకోండి



ట్రావెల్స్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మస్వవుర్ రాజీ, మాజీ మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్ : పవిత్ర ఉమ్రా, హజ్ యాత్రకు వెళ్లాలనుకుంటున్న ముస్లింలు ఖిద్మత్-యే-ఉమ్రా ట్రావెల్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని బీహార్ రాష్ట్రం బాగల్పూర్‌కు చెందిన మత గురువు సయ్యద్ మహమ్మద్ మస్వవుర్ రాజీ కోరారు. ఆదివారం కడప నగరంలోని మాసాపేట సమీపంలో ఖిద్మత్-యే-ఉమ్రా ట్రావెల్స్‌ను సయ్యద్ మహమ్మద్ మస్వవుర్ రాజీ, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, నగర ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం, మాజీ మేయర్ సురేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింలు ఖిద్మత్-యే-ఉమ్రా ట్రావెల్స్ అతి తక్కువ ధరతో ఉమ్రాకు వెళ్లవచ్చని తెలిపారు. ట్రావెల్స్ అధినేత షేక్ అలీషర్ మాట్లాడుతూ ప్రతి ముస్లిం తన జీవితంలో ఒకసారి అయినా ఉమ్రా వెళ్లాలని అనుకుంటారని, అలాంటి వారికి ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు జమీర్, అఫ్జల్, జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు తాహిర్, కాంగ్రెస్ నేత నజీర్ అహ్మద్, సంఘసేవకులు సలాద్దీన్, డాక్టర్ నాజిముద్దీన్, రహంతుల్లా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



శిల్పారామంలో నృత్యం చేస్తున్న యువకులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగర శివార్లలోని శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శిల్పారామం సాంస్కృతిక కళావేదికపై మిస్సా మూవీ పద్మాకర్ సహకారంతో కడప నగరానికి చెందిన కిషోర్ డాన్స్ అకాడమీ విద్యార్థి విద్యార్థులు పల్లె జానపదాలు, శాస్త్రీయ, సినీ వృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ హాస్పిటల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప జీజీహెచ్, పోరుమామిళ్ల, బద్వేల్ ప్రభుత్వ హాస్పిటల్‌లో శానిటేషన్ సెక్యూరిటీ కార్మికులకు గత కాంట్రాక్టర్ వేతనాలు పెండింగ్‌లో పెట్టారని ఆ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కొంతమందికి పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, చంద్రారెడ్డి, పవన్, రవి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సిద్దవటం : కడప-చెన్నై జాతీయ రహదారి జేఎంజే కళాశాల సమీపంలో ఆదివారం రాత్రి ఎస్ఐ మహమ్మద్‌రఫీ వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, పరిమితి మించి ఓవర్ స్పీడ్ వెళితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తప్పనిసరిగా లైసెన్స్, వాహనపత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం మెరుగు

ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఏఆర్ డీఎస్పీ రమణయ్య, పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్: సైక్లింగ్‌తో ఆరోగ్యం మెరుగుపడుతుందని ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో ఆదివారం కడపలో పోలీసుల ఆధ్వర్యంలో 'సైకిల్ ఆన్ సండే' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, సంధ్య సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్, మహావీర్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, ఎస్పీ బంగ్లా, రాజారెడ్డి వీధి మీదుగా జిల్లా పోలీసు కార్యాలయం వరకు సైకిల్ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ సైకిల్ తొక్కి అందరినీ ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సైక్లింగ్‌తో ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు కూడా సైకిల్ వినియోగం ఎంతగానో దోహదపడు తుందన్నారు. సైక్లింగ్‌తో శారీరకంగా ఫిట్‌గా ఉండొచ్చని ఆయన తెలిపారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో అందరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని, వ్యాయామం వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబానికి మేలు చేస్తుందని తెలిపారు. ఏఆర్‌డీఎస్పీ నాగేశ్వరరావు, ఆర్ఐలు శివరాముడు, టైటస్, శ్రీశైల రెడ్డి, కడప టూటౌన్ సీఐ గంటా సుబ్బారావు, చిన్నచౌకు సీఐ ఓబులేసు, ట్రాఫిక్ సీఐ జావీద్, పెండ్లిమర్రి ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి, కడప వన్ టౌన్ ఎస్ఐ ప్రతాప్ రెడ్డి, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్లు, స్వామినాయక్, రామస్వామి రాజు, చూడామణి వర్మ, పోలీస్ అధికారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఏఆర్, సివిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉన్నతి సాధ్యం



అధ్యాపకుడిని సన్మానిస్తున్న ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్: ప్రతి విద్యార్థీ తన గురించి తాను తెలుసుకుంటూ మంచితనం, విలువలతో కూడిన విద్య నేర్చుకుంటే ఉన్నతి దానంతటదే వస్తుందని గ్లోబల్ గ్యాస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రుక్సానా అన్నారు. గ్లోబల్ గ్యాస్ అకాడమీ, కేఎస్ఆర్ఎం కాలేజ్ సంయుక్తంగా 6వ ఇంటర్ నేషనల్ టీచర్స్ అవార్డ్స్- 2025 కార్యక్రమం ఆదివారం కేఓఆర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు గ్లోబల్ గ్యాస్ అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం రుక్సానా మాట్లాడుతూ ప్రైవేట్ రంగాల్లో ఉంటూ విద్యార్థుల ఉన్నతి గురించి ఆలోచించడం గొప్ప విషయన్నారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డాక్టర్ ఏవీఎస్ కుమారస్వామి మాట్లాడుతూ భావితారలను అందిస్తున్న గురువులకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో శక్తి వంతమైనదని ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్ అన్నారు. కేఎస్ఆర్ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేశ్వరప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా విద్యాబోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కందుల విద్యా సంస్థల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరి, ఏపీ, తెలంగాణ అంబాసిడర్ సమతా నాయుడు, కందుల లక్షుమ్మ మెమోరియల్ కాలేజీ ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ, కేఎస్ఆర్ ఎం కళాశాల హెచ్ఓడీలు ప్రియదర్శిని, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మల్లికార్జున రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్ రంగంలో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2లు, ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్-5 రాష్ట్ర కౌన్సిల్ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జునరెడ్డి, సుధీర్ బాబు కోరారు. ఆదివారం నగరంలోని ముస్లిం మైనార్టీ కమ్యూనిటీ హాల్‌లో ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్-5 రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2లు, ఉద్యోగుల, కార్మికుల సమస్యలు చాలా సంవత్సరాలుగా ఎలాంటి పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయని. విద్యుత్ యాజమాన్యం త్వరగా పరిష్కరించాలని హితవు పలికారు. జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్- 2లు 6 ఏళ్లుగా పనిచేస్తున్న ప్రమోషన్లకు అనర్హులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ యాజమాన్యం ఒక సంస్థలో రెండు రకాల సర్వీసులు అమలు చేస్తోందని, ఇది పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. విద్యుత్ యాజమాన్యం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ఇప్పటికైనా ఎనర్జీ అసిస్టెంట్‌ల ప్రధాన సమస్య అయిన నూతన సర్వీస్ రూల్స్ రద్దు చేసి ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నాగసుబ్బారెడ్డి. 5 అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి హేమకుమార్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు హరికృష్ణ, అశోక్, ప్రతాప్, కృపాకర్, వెంకటేష్ నాయక్, సంజీవ నాయక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గురువుల రుణం తీర్చుకోలేం



గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కడప సెవెన్ రోడ్స్: తమ ఉన్నతికి అన్ని విధాల తోడ్పాటు అందించిన న్యూ లిటిల్ ఏజెంల్స్ ఇంగ్లీషు మీడియం స్కూలు కరస్పాండెంట్ వెంకట సుబ్బయ్య, ఉపాధ్యాయుల రుణం తీర్చుకోలేమని పూర్వ విద్యార్థులు అన్నారు. ఆదివారం కడప నగరం అంగడివీధి శివాలయం వద్ద న్యూ లిటిల్ ఏజెంల్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 2015–16 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాలు తెలుసుకుని వారు జీవితంలో సాధించిన విజయాలు తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. అప్పటి సంగతులను, నేటి పరిస్థితులను ఒకరికొకరు చెప్పుకుని ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడడానికి అప్పటి గురువులే కారణమన్నారు. గౌస్‌బాషా, అక్రమ్, సౌజన్య, శ్రీకాంత్, రాజేశ్వరి కృషి వలనే ఈ కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభుత్వం వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం నాయకులు ఓర్సు బాలకొండయ్య, బత్తల జానకిరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం వడ్డెర సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం నూతన గౌరవ అధ్యక్షుడిగా బత్తల జానకి రామ్, జిల్లా అధ్యక్షుడిగా దేరంగుల శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బత్తల శీను, ప్రధాన కార్యదర్శిగా వెంకట్, కోశాధికారిగా గంపా శీనును ఎన్నుకున్నారు. అనంతరం బాలకొండయ్య, బత్తల జానకిరామ్ మాట్లాడుతూ వడ్డెర సమస్యలను పరిష్కరించేందుకు నూతన కార్యవర్గం ఉద్యమించాలని కోరారు. జిల్లాలో వడ్డెర సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వారికి అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, ఉపాధ్యక్షులు బండారు వెంకటరమణ, మల్లికార్జున, వెంకటసుబ్బయ్య, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ గండికోట వెంకటసుబ్బయ్య, యూత్ నాయకులు గంపా వెంకటసుబ్బయ్య, మల్లి, ప్రసన్న పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు ఉంటే కేవలం ఉంటే రూ. 400 కోట్లు మాత్రమే విడుదల చేశారని తెలిపారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు చదువులు మధ్యలో ఆపేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే పూర్తిగా రీయింబర్స్ మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న బలిజ సంఘం నాయకులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : విద్యార్థి దశ నుంచి కష్టపడి చదివితే ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని బలిజ సంక్షేమ సంఘం నాయకులు పీవీఎస్ మూర్తి, అమరప్ప అన్నారు. ఆదివారం బలిజ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు కార్యక్రమంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు వెంకట కార్తీక్ కుమార్, నీలం నాగవరుణ్‌కు రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని ఉపాధ్యాయుడు సుంకర సునీల్‌కుమార్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిజ సంఘాన్ని ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని కొనియాడారు. అంతేకాకుండా సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థులకు అండగా నిలబడిన దాతలను అభినందిస్తున్నామన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని కోరారు. మైదుకూరు మేధా విద్యా సంస్థల అధినేత నరసింహులు, బలిజ సంక్షేమ సంఘ నాయకులు సుబ్రహ్మణ్యం, దామోదర్, సత్యనారాయణ, కేశవులు, విజయ్‌కుమార్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్‌బేగం

కడప ఎడ్యుకేషన్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత పొందవచ్చని కడప నగర ఇన్‌చార్జి మేయర్ ఎస్. ముంతాజ్ బేగం అన్నారు. సైనిక్ నగర్‌లోని మదరసా ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్‌లో మహమ్మద్ ప్రవక్త (సల్లెల్లాహు అలైహి వసల్లం) జీవిత చరిత్రపై రాత పరీక్ష విజేతలకు కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎఫ్.ఎం. ముక్తార్ అహ్మద్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప నగర ఇన్‌చార్జి మేయర్ ఎస్. ముంతాజ్ బేగం , శ్రీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సి. ఓబులరెడ్డి, జామియా బిలాల్ నాజీమ్ ముఫ్తీ మహమ్మద్ నాసిరుద్దీన్, గౌరవ అతిథులుగా పయాం ఇన్సానియత్, కో కన్వీనర్ మౌలానా షేక్ మక్బూల్ అహ్మద్ నద్వి, మాజీ కార్పొరేటర్ ఎస్ జమాల్ వలి పాల్గొన్నారు. అనంతరం అతిథులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ ఇదాయతుల్లా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం కడప స్కౌట్ హాల్‌లో ఇటీవల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన 25 మంది ఉపాధ్యాయులతోపాటు పదవీ విరమణ పొందిన 19 మంది సీనియర్ ఉపాధ్యాయులు, హెడ్మాస్టర్లు, మండల విద్యాశాఖాధికారులకు ఆర్జేయూపీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రాంగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా జ్ఞాపిక పూలమాల, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పీఆర్సీ, డీఏ తదితర అంశాలపై ఒక స్పష్టత వస్తుందన్నారు. ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ పెండింగ్ సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేయూపీ అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి షరీఫ్, ప్రధాన సలహాదారు బాలకృష్ణ, టీచర్స్ హోం అధ్యక్షుడు బండారు రాజగోపాల్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు రామానాయుడు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సిద్దయ్య, కడప జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రసాదరావు, పుల్లయ్య, కర్నూలు జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి, నాయకులు ఆంజనేయులు, వీరయ్య, వీరన్న, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు సరే.. మెటీరియల్ సంగతేంటి?

కడప సిటీ : మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో భాగంగా వేతన జీవులకు రావాల్సిన వేతనం మాత్రం అందింది. కానీ, మెటీరియల్‌కు సంబంధించిన బిల్లులు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయి. ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన వేతనాలు మే 31 నుంచి ఇప్పటివరకు పెండింగ్ ఉన్నాయి. దాదాపు 11 వారాలకు సంబంధించిన వేతనాలు అందాయి. మొత్తం రూ. 119 కోట్లు రావాల్సి ఉండగా, ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ. 1,600 కోట్లు కూలీల వేతనాలకు మంజూరు చేయగా, అందులో భాగంగా జిల్లాకు పెండింగ్ వేతనాలు అందాయి. అయితే మెటీరియల్ బిల్లులకు సంబంధించి రూ. 40 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. సంబంధిత పనులు చేసిన వ్యక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్రం సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉపాధి హామీ పనుల్లో భాగంగా మెటీరియల్ కింద సిమెంటు, బీటీ, మెటల్ రోడ్లు వేశారు. గత మార్చి నుంచి ఇప్పటివరకు అందుకు సంబంధించిన బిల్లులు కూలీల వేతనాలతోపాటు అందుతాయనుకున్న ఆశ వారికి నిరాశగా మారింది. ఈ నేపథ్యంలో అప్పుల ఊబిలో చిక్కుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ విషయంపై డ్వామా పీడీ ఆదిశేషారెడ్డిని వివరణ కోరగా.. మెటీరియల్ బిల్లులు త్వరలో అందే అవకాశం ఉందని తెలిపారు.

ప్రజల భద్రతకు 'విజిబుల్ పోలీసింగ్'



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కడప అర్బన్: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పోలీసులు ×విజిబుల్ పోలీసింగ్÷ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువవుతూ, నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారు.

వాహనాల తనిఖీలు

అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా నిషేధిత వస్తువులు, గంజాయి వంటి వాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితో పంచుకోవద్దని సూచిస్తున్నారు.

రహదారి భద్రత నిబంధనలు

రహదారి భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అలాగే ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కూడా చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా పోలీసులు ప్రజల మధ్య ఉంటూ వారికి రక్షణ కల్పిస్తున్నారు. ప్రజలు భద్రతకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.